ప్రజాశక్తి
మంగళవారం 8 ఏప్రిల్ 2025

టిడిపి 'విశ్వాసం'పై నీళ్లు

పార్వతీపురం: స్థానిక మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరిపై టిడిపి ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మాన నోటీసు సరైన ఫార్మాట్‌లో ఇవ్వలేదనే కారణంతో కలెక్టర్ శ్యాంప్రసాద్ దాన్ని తిరస్కరించినట్లు తెలుస్తోంది. 10మంది కౌన్సిలర్లు వైసిపి నుంచి టిడిపిలోకి చేరడంతో చైర్ పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి టిడిపి పావులు కదిపింది. 18 మంది కౌన్సిలర్లతో జాయింట్ కలెక్టర్ శోబికకు గత నెల 24న అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నాయకత్వంలో టిడిపి కౌన్సిలర్లు అట్టహాసంగా నోటీసు అందజేశారు. తెల్లకాగితంపై అవిశ్వాస తీర్మానం గురించి రాస్తూ కౌన్సిలర్ల సంతకాలు చేసి అందించారు. అయితే ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫార్మాట్‌లో అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వలేదని అధికారులు తిరస్కరించారు. దీంతో టిడిపి అతి విశ్వాసంపై నీళు జల్లినట్లయింది. మరోసారి అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడానికి ప్రయత్నిస్తారా లేదా విరమించుకున్నారా అన్నది తేలాల్సి ఉంది.

తాగునీటి కొరత ఉండరాదు : కలెక్టర్

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లావ్యాప్తంగా ఎక్కడా తాగునీటి కొరత ఉండరాదని, సమస్యలు ఉన్నచోట్ల ఎంపిడిఒలు బాధ్యత తీసుకొని శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 'ప్రజాశక్తి'తో సోమవారం ప్రచురితమైన గొంతెండుతున్న గ్రామాలు అన్న వార్తకు కలెక్టర్ స్పందిస్తూ సోమవారం తన ఛాంబరులో ఆర్‌డబ్ల్యుఎస్, ఇంజినీర్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గల తాగునీటి సమస్యలను పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒల దృష్టికి తీసుకురావాలని, వారు తక్షణమే వాటిపై స్పందించి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని హితవు పలికారు. జిల్లాలో తాగునీటి కొరత ఉందనే వార్తలు వినిపించరాదని స్పష్టం చేశారు. విద్యుత్ హెచ్చుతగ్గుల వల్ల తరచూ మోటార్లు మరమ్మతులకు గురౌతున్నాయని, అందువల్ల కొన్ని గ్రామాల్లో తాగునీటికి అంతరాయం కలుగుతుందని కొందరు అధికారులు కలెక్టరు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుంచి రెండు, మూడు మోటార్లను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుకోవాలని, ఆయా మండలాల్లో మోటార్ల సమస్య తలెత్తిన వెంటనే వాటి స్థానంలో కొత్త మోటార్లను బిగించి నీటి సరఫరాను చేయాలన్నారు. విద్యుత్ హెచ్చుతగ్గులు లేకుండా శాశ్వతంగా సమస్యను పరిష్కరించుకోవాలని తెల్చి చెప్పారు. అలాగే పాచిపెంట మండలం మిలియకంచూరు పంచాయతీలోని ములగపాడు, కందివలస, కాకులమడ గ్రామాల్లో నీరు కలుషితమై అనారోగ్యం పాలవుతున్నారని కలెక్టర్ మండిపడ్డారు. అలాగే సాలూరులోని డెన్నారాయిలో తాగునీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న విషయమై కలెక్టర్ ఆరా తీశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కావాలని కలెక్టర్ గ్రామీణ నీటిసరఫరా ఇంజనీర్లను ఆదేశించారు. కలుషిత నీరున్నచోట అవసరమైతే తాత్కాలికంగా 20 లీటర్ల క్యానులను తాగేందుకు మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే కురుపాం, పార్వతీపురం మండలాల్లో తలెత్తిన సమస్యలపై ఆయా ఇంజినీర్లను అడిగి తెలుసుకున్న కలెక్టర్ రానున్న 48 గంటల్లోగా సమస్య పరిష్కారం కావాలని, అంత వరకు తాగునీటికి అంతరాయం లేకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటిసరఫరా ఇంజినీరింగ్ అధికారులు తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కు వివరించారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపిడిఒలు, పంచాయతీ సెక్రటరీలు, గ్రామీణ నీటిసరఫరా ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాసూరులో ట్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ పాలకొండ ఎఇ ప్రవల్లిక

తాగునీటి సమస్యలపై పరిశీలన

పాలకొండ : గొంతేండుతున్న గ్రామాలు అన్న ప్రజాశక్తి వార్తకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. బోర్లు, రక్షిత మంచినీటి పథకాలు, నేల బావుల ద్వారా తాగునీరు అందుతుందా, లేదా అని గుర్తించారు, కొత్త బర్న, చిన్న కోటిపల్లి, లుంబూరు, బాసూరు గ్రామాల్లో ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ప్రవల్లిక పర్యటించి తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారమే పిజిఆర్ఎస్ లక్ష్యం: కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయంగా జిల్లా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, పరిష్కారంలో అర్జీలు రీఓపెన్ కారాదని కలెక్టర్ అధికారులకు తేల్చిచెప్పారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్‌డిఎ పీడీ సుధారాణి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 110 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యత గల ఎండార్స్‌మెంట్ అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా శాఖాధికారులు వారి శాఖలకు సంబంధించిన వినతులను క్షుణంగా పరిశీలించి, తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, జాప్యం చేస్తే సహించబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

110 వినతులు స్వీకరణ

బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న రలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జెసి, పిఒ

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం సహించేది లేదు : ఎస్‌పి

పార్వతీపురంరూరల్ : ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి ఆలస్యం లేకుండా పిటీషన్లకు పరిష్కారం చూపాలని ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 9 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్బీ సిఐ అదాం, సిబ్బంది పాల్గొన్నారు

గ్రీవెన్స్‌కు 56 వినతులు

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 56 అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ ఐటిడిఎలో సోమవారం పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గొయ్యి గూడాకు చెందిన శంకర్రావు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కోటకొండకు చెందిన రాజారావు గృహాలు మంజూరు చేయాలని, కోతంకు చెందిన శ్రీను సిసి రోడ్డు మంజూరు చేయాలని, దిగువ దారభకు చెందిన తోటయ్య సిసి కాలువ వేయాలని కోరారు. సన్నాయి గూడకు చెందిన సూరన్న పవర్ విడర్ మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ ఇఒ రవి ప్రసన్నకుమార్, డిఇ సింహాచలం, పిహెచ్ఒ వెంకటగణేష్, ఎటిడబ్ల్యు జి.మంగవేణి, ఎపిడి సన్యాసిరావు, ఎంఒ పి కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

అక్రమ సస్పెన్షన్ అన్యాయం

- ఎస్‌టి బాబును తిరిగి విధుల్లోకి తీసుకోవాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్
- డిఎం వైఖరిని నిరసిస్తూ డిపో గేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ కార్మికుల పట్ల అనుసరిస్తున్న తీరు సరైంది కాదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రశ్నించిన కార్మికులను సస్పెండ్ చేయడం అన్యాయమని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సీతాలక్ష్మి అన్నారు. ఎస్‌టి బాబుపై విధించిన అక్రమ సస్పెండును ఎత్తివేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ డిపో గేటు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కె.సీతాలక్ష్మి మాట్లాడుతూ డిపో మేనేజర్ కార్మికులను 1/2019 సర్క్యులర్కు విరుద్ధంగా సస్పెండ్, బదిలీలు చేస్తున్నారని, ఇది చాలా అక్రమమైన చర్యని అన్నారు. ఎస్‌టి బాబు గతం నుంచి డిపోలో జరుగుతున్న అనేక అక్రమ పనులకు అడ్డుపడుతూ ప్రతి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను వ్యతిరేకిస్తుండడంతో ఓడి కండక్టర్ జెఎం రావుతో తప్పుడు ఫిర్యాదు రాయించుకొని దాని ఆధారంగా బాబును సస్పెండ్ చేయడం అన్యాయమని తెలిపారు. ఈ అన్యాయమైన చర్యను ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ పట్ల డిపో మేనేజర్ కక్షపూరితమైన చర్య చేపడుతున్నారని, దీన్ని మానుకోవాలని సూచించారు. కండక్టర్ బాబు విధి నిర్వహణలో తప్పుడు కార్యక్రమాలు చేపడితే, దానిపైన విచారణ చేపట్టి, మెమో జారీ చేసి, క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని, ఆ క్రమంలో అతని తీరు మారకుంటే సస్పెండ్ చేయాలే గాని, ఎటువంటి కారణం లేకుండా కార్మికుల మధ్య ఉండే చిన్నపాటి ఘర్షణను ఆసరాగా తీసుకొని ఇటువంటి విఘాతానికి పాల్పడడం అన్యాయమని అన్నారు. తక్షణమే బాబును మళ్లీ విధుల్లోకి తీసుకొని అతనిపై ఉన్న సస్పెండ్ ఆర్డర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యతులో పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ అక్రమ చర్యలపై పెట్టే శ్రద్ధ బస్సుల ఫిట్నెస్‌లపై, ప్రతి గ్రామానికి బస్సు నడిపేందుకు డిఎం కృషి చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల ద్వంద్వ వైఖరిని అనుసరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయనగరం జోనల్ అధ్యక్షులు వి.రాములు, విజయనగరం డిపో కార్యదర్శి ఎ.చంద్రయ్య, బి.లక్ష్మి, డిఎస్ రావు, పార్వతీపురం డిపో అధ్యక్షులు ఎస్ఎస్ రావు, సిహెచ్ఎల్ రావు, జిఎస్‌రావు, టి.వెంకటి, త్రినాథ్ పాల్గొన్నారు.

గుర్తించిన సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలాల్లోని ప్రత్యేక అధికారులకు ఆయా ప్రాంతాల్లోని సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఇకపై ప్రతి శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని, అక్కడ నుంచే వీడియో సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని మండలాల్లో ప్రత్యేక అధికారులను మార్పు చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా నియమించబడిన ప్రత్యేకాధికారుల వద్ద ఆయా మండలాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలని, అలాగే క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఇందుకోసం మండల ప్రత్యేక అధికారులు అన్ని శాఖల సమాచారాన్ని వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఇకపై మండలాల్లో స్వయంగా పర్యవేక్షించి ప్రజల సమక్షంలోనే సమస్యలను మండల ప్రత్యేక అధికారులను అడిగి తెలుసుకుంటామని, కావున ఎంఎస్‌ఒల వద్ద పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని తేల్చిచెప్పారు. సమావేశంలో అన్నిశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కురుపాంలో తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న విఆర్‌ఎలు

విఆర్ఎల సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం

విఆర్ఎల సమస్యలపై ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలో గల విఆర్ఎలు సోమవారం తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారీ పోరాటంలో భాగంగా ప్లే స్కేల్ పెంచాలని, అటెండర్లు, రాత్రి కాపలాదారులను విఆర్ఎలుగా అర్హత గలవారికి ప్రమోషన్లు ఇవ్వాలని, నామినీ విఆర్ఎలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని కోరుతూ వినతి పత్రం అందేశారు. కార్యక్రమంలో పలువురు విఆర్ఎలు పాల్గొన్నారు.

సీతానగరం: గ్రామ సేవకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు జి.వెంకటరమణ ఆధ్వర్యాన విఆర్ఎ సంఘ నాయకులు ఆర్.ఆనంద్ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిని పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి.వెంకటరమణ మాట్లాడుతూ గ్రామ సేవకులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, 010పద్దు కింద వేతనాలు చెల్లించాలని, నామినీలను కొనసాగించాలని తదితర పలు డిమాండ్లపై వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఎలు బి.జోగులు, జోజి, లక్షుం, ఆశిరమ్మ పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురాన

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి అన్నారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం గుంటూరు, కర్నూల్ రేంజ్‌కు సంబంధించిన 36 మంది నూతన ప్రొబేషనరీ ఎస్ఐలను ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించారు. 36 మంది నూతన ప్రొబేషనరీ ఎస్ఐలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో జిల్లా ఎస్‌పిని కలిశారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న వారికీ అభినందనలు తెలిపారు. ముందుగా వారి వివరాలు, ఏమి చదువుకున్నారు, శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహనా కల్పించేందుకు వారికి పోలీస్ స్టేషన్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రాక్టికల్ శిక్షణలో వారికి కేటాయించిన పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలను తరుచూ సందర్శించాలని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలను సందర్శించాలని, అక్కడ ప్రజలతో మమేకమై సైబర్, నక్సలిజమ్, మత్తుపదార్థాలు, నాటుసారా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. వారం వారం జరిగే సంతలు సందర్శించడం, వాహన తనిఖీలు చేయడం, ఇన్ఫర్మేషన్ సేకరించడం మొదలగు అంశాల గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలని, ఎక్కడా ఏవిధమైన అనుమానం వచ్చిన వెంటనే సీనియర్ అధికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి అంకిత సురాన, సిసిఎస్ సిఐ అప్పారావు, ఎఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి సిఎఆర్ఎం మిషన్

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో సి-ఎఆర్ఎం మిషన్ అందుబాటులోకి వచ్చిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సహకారంతో సిఎస్ఆర్ నిధులు రూ.12.5 లక్షలతో కేటాయించి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇది రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రోగులు పట్టణాలకు వెళ్ళవలసిన అవసరం లేదన్నారు. ఆర్థోపెడిక్ రోగులకు సర్జరీ చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈయనతో పాటు ఆర్థోపెటిక్ వైద్య నిపుణులు కె. రాజేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్లు గరం గరం

- విస్తృత స్థాయి సమావేశంలో ఆవేదన
- వైసిపి జెండా మోసిన వారికి పదవులు
- మంత్రి అచ్చెన్నపై ధ్వజం

ప్రజాశక్తి పాలకొండ

ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ల పదవుల్లో నిజమైన తెలుగుదేశం కార్యకర్తలకు అన్యాయమైందని వైసిపికి ఓట్లు వేయించిన వారికి పదవులు వచ్చాయని టిడిపి శ్రేణులు బొగ్గుమన్నాయి. సోమవారం వీరఘట్టం రోడ్‌లో గల ప్రైవేట్ కళ్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నేతలంతా ముక్తకంఠంగా పదవుల పంపకంలో తమకు అన్యాయం జరిగిందంటూ ధ్వజమెత్తారు. 2019, 2024 ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యేకు పనిచేసిన వారికే పదవులు వచ్చాయని, పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా తమకు గుర్తింపు లేదని భవిష్యత్తులో ఇలా ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన చెందారు. జనసేన ఎమ్మెల్యే అని గెలిపించుకోవడానికి తామంతా ఎంతో కష్టపడ్డామని, అయితే ఎమ్మెల్యే వ్యతిరేకంగా పనిచేసిన వారికి పదవులు రావడం అన్యాయమని అన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆ గ్రూపునకు అనుకూలంగా పనిచేస్తున్నారని బహిరంగంగానే ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసిన వారు ఎవరో గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అభిప్రాయం తో పాటు జిల్లాలో ఉన్న మంత్రి సంధ్యారాణి అభిప్రాయం తీసుకోవాలన్నారు. పార్టీ బలపడాలంటే నిజమైన నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ భూదేవిని ఆ పదవి నుంచి తొలగించాలన్నారు. ఇన్చార్జిగా ఆమె ఉండడం వల్లే పార్టీ బలపడడం లేదన్నారు. ఈ అంశంపై రాజధానికి బయలుదేరి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌ను కలవాలని నిర్ణయించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి, పాలకొండ, వీరఘట్టం మండలాల టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, ఉదయా భాస్కర్, నాయకులు జాడ శ్రీధర్, వెన్న శ్రీనివాసరావు, సవరతోట ముఖ, లింగం జామ లక్ష్మీనారాయణ, భూపతి ఆనందరావు తదితరులు ఉన్నారు.

సమావేశంలో నాయకులకు సమస్యను వివరిస్తున్న టిడపి కార్యకర్తలు

సమస్యలపై ప్రజాప్రతినిధులు ధ్వజం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఆ శాఖ అధికారులపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రస్తుతం వేసవి దృష్ట్యా మండలంలో తాగునీరు, విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పూర్వం వేసిన విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలకు హాని కలిగే ప్రమాదం ఉందని అన్నారు. వీటిని మార్పు చేయాలని ఏజెన్సీ ప్రాంత సర్పంచులు కోరారు. స్పందించిన ఎఇ సింహాచలం మాట్లాడుతూ స్తంభాల మార్పిడికి శాఖా పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా వేసవి దృష్ట్యా మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను సభ్యులు కోరారు. అలాగే పలు శాఖల అధికారులు శాఖాపరమైన వివరాలను వెల్లడించారు. సమావేశంలో కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, తహశీల్దార్ డి.రవి, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, కె.రవీంద్ర, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ జెఇని నిలదీస్తున్న సర్పంచులు యుగంధర్, అప్పలనాయుడు

ఎస్ఐకు అనారోగ్యమని డబ్బులు కాజేసిన

సైబర్ నేరస్తుడు అరెస్ట్

ప్రజాశక్తి - పాలకొండ

వీరఘట్టం ఎస్సై డబ్బులు కావాలంటూ గత నెల 31న సైబర్ నేరానికి పాల్పడిన మున్నం వెంకట నవీన్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్టు డిఎస్‌పి ఎం.రాంబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డిఎస్‌పి తెలిపారు. మార్చి 31న పోలీస్ స్టేషన్ నుంచి ప్రభాకర్ మాట్లాడుతున్నానని, ఎస్సై గారికి ఆరోగ్యం బాలేదు ఆసుపత్రిలో ఉన్నారని ఫోన్ పే ద్వారా రూ.28వేలు పంపిస్తే స్టేషనకి వస్తే ఇస్తామంటూ ఒక వ్యక్తి అక్కడ ఉన్న ట్రావెల్ వ్యాపారికి ఫోన్ చేశాడు. దీంతో ఆయన డబ్బులు వెంటనే ఫోన్ పే చేశాడు. ఇంకేమైనా అవసరం ఉందని మరి కాసేపటికి ఫోన్ చేయగా ఆ ఫోన్ నెంబరు స్విచ్ ఆఫ్ రావడంతో దగ్గరలో ఉన్న వ్యక్తిని స్టేషన్‌కు పంపించారు. విషయం చెప్పగా అలాంటిదేమీ లేదని పోలీసులు చెప్పడంతో తెల్లమొఖం వేశారు. ఫోన్ నెంబర్ ఆధారంగా కేసును వీరఘట్టం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పాలకొండ సిఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎస్సై కళాధర్, సిబ్బంది కేసు ఛేధించారు. బాపట్లకు చెందిన వ్యక్తిగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుతో పాటు విజయనగరం పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని వ్యాపారుల నుంచి నవీన్‌తో పాటు మరో వ్యక్తి కొంత మొత్తం డబ్బులు ఫోన్ పే ద్వారా కాజేశారు. అందులో నవీన్ రూ.27 వేలు తీసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఆ నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సిఐ చంద్రమౌళి వీరఘట్టం, పాలకొండ ఎస్సైలు కళాధర్, ప్రయోగమూర్తి ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు, పక్కన సిఐ, ఎస్ఐలు

ఎవర్నీ నమ్మొద్దు : డిఎస్‌పి

ఎవరిని నమ్మి మోసపోవద్దని డిఎస్‌పి రాంబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువయ్యారని, కావున అప్రమత్తంగా ఉండాలని అన్నారు పోలీసులని చెప్పి ఎవరు ఫోన్ చేసినా భయపడొద్దని, వివరాలు కొనుక్కోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అయ్యాయని, కావున ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి అన్నారు.

ఆరోగ్యంతోనే ఆశాజనక భవిష్యత్తు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పరిపుష్టమైన ఆరోగ్యంతోనే ఆశాజనకమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చని, ఆరోగ్యం మహాభాగ్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన ర్యాలీని ఆరోగ్య కార్యాలయం నుండి జెండా ఊపి ప్రారంభించారు. మెరుగైన ఆరోగ్యానికి సంబంధించిన నినాదాలు చేస్తూ వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం ఎన్‌జిఒ హోమ్‌లో సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదాన్ని అనుసరించి పుట్టుక నుండే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని అందుకు గాను మాతా,శిశుఆరోగ్యం పెంపొందించేందుకు కృషి చేయాలని, గర్భిణీ, శిశు, బాలింత ఆరోగ్యానికి సంబంధించిన వైద్య సేవలు పక్కగా అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కెవిఎస్ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, పిపి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ విజయ్ మోహన్, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, డెమో యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గరుగుబిల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యమైన జీవితాన్ని గడపాలని, జీవన నాణ్యతను పెంచుకోవాలని చెప్పడమే ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ముఖ్యోద్దేశ్యమని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ర్యాలీ నిర్వహించి, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలను ప్రభావితం చేసే అనేక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచేందుకు ఈ ప్రత్యేక దినోత్సవాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కేటాయించిందన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యల్లేని జీవితాన్ని గడపాలనుకుంటే ఖచ్చితంగా కొన్ని జీవన శైలి పద్ధతులు పాటించాలని అన్నారు. శరీరంలో తగినంత నీరు ఉంటేనే కెరీయర్ పనితీరు సక్రంగా ఉంటుందని, ఆక్సిజన్ అందేలా నీరు సహకరిస్తుందని తెలిపారు. సమతుల భోజనాన్ని ప్రతి పూటా తింటే అన్ని రకాల పోషకాలు శరీరానికి అందుతాయని అన్నారు. ఎంతో కొంత శారీరక శ్రమ చేయాలని, శారీరక శ్రమ చేయడం వల్ల మానసిక స్థితి కూడా మెరుగుపరచుకోవచ్చు, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, ఒత్తిడిని తగ్గించుకోవచ్చు, బరువు పెరగకుండా నియంత్రణలో ఉంచుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, చిన్నమ్మి, రవణమ్మ, ఉదయకుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను ప్రభావితం చేసే అనేక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచేందుకు ఈ ప్రత్యేక దినోత్సవాన్ని కేటాయించిందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యమైన ఉండాలని ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. వారి జీవనశైలి వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా సామాజిక ఆరోగ్య ము పరిసరాల పరిశుభ్రతకు ఆహ్లాదకర పర్యావరణానికి తద్వారా ప్రకృతి సౌందర్యాలకు బోధపడే దిశగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జయ గౌడ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం: ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

సీతానగరం : మండలంలోని సీతానగరం, పెదంకలాం ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి నుంచి హనుమాన్ కూడలి వరకు వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పావని, ఉషారాణి, రమ్య సాయి మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు సిఇఒ సూర్యనారాయణ, వెంకటరమణ, హెచ్‌వి సత్యవతి, వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ ఆరోగ్యంగా ఉండాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్, సూపర్వైజర్లు జనార్ధనరావు, శాంతి కుమారి, ఆదిలక్ష్మి, ఎంఎల్ హెచ్పీలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి శిక్షణతో ఉపయోగం

ప్రజాశక్తి - భామిని

భామిని ఎపి మోడల్ స్కూల్‌లో వృత్తి విద్యా కోర్సులు చేస్తున్న విద్యార్థులు తమ రంగంలో అనుభవం, నైపుణ్యాలు పెంచుకోవడానికి 12 రోజులు ఇంటర్న్‌షిప్ (వృత్తిపరమైన శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అవి పని చేసే విధివిధానాలను తెలుసుకున్నారు. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి వృత్తిపరమైన అనుభవం లభించడానికి కెరీర్ మార్గంలో అడుగులు వేయడానికి ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ రమేష్ పాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు చిక్కాల హరిప్రసాద్, కొల్లి మాధవి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ముగ్గురు అధికారులే హాజరు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంఛార్జి ఎంపిడిఒ డి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. అధికారులు లేరా? అసలు సమస్యలే లేవా అంటూ? స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

నేటి నుంచి పౌష్టికాహార పక్షోత్సవాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మంగళవారం నుంచి ఈనెల 22 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు అంగన్వాడీ కేంద్రం స్థాయిలో నిర్వహిస్తామని సిడిపిఒ అనంతలక్ష్మి తెలిపారు. గర్భిణుల మొదటి 1000 ప్రాముఖ్యత, పోషణ, సంరక్షణ, బరువు తక్కువ పిల్లలు గుర్తింపు -సంరక్షణ చర్యలు గురించి తల్లులకి తెలియజేస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులు స్వయంగా నమోదుకు, పిల్లలలో ఆరోగ్య కరమైన జీవన శైలి, ఆహార పద్ధతులు అలవాటు చేసుకునేలా తల్లులకు, అవగాహనా కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలననుసరించి 2025-26 మొదటి, రెండో అర్ధ సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన ఇంటి, ఖాళీ స్థలాల పన్నులు ఈ నెలాఖరులోగా ముందుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చని కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నివాస, వాణిజ్య సముదాయాల, స్థల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం ఆ పాఠశాల ప్రధానో పాధ్యాయులు గంట్యాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు కె.తేజస్విని కావ్య, సుమతి, పి.స్రవంతి, ఎస్ ఝాన్సీ, జి.లాస్య ప్రియ ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాది రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు ఆర్థిక సహాయం అందుతుందని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గాయత్రి డిగ్రీ కాలేజీలో రేపు క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

తోటపాలెం గాయత్రి డిగ్రీ కాలేజీలో ఈనెల 9న బుధవారం అరబిందో న్యూలాండ్స్, గ్రాన్యూల్స్ తదితర ఫార్మా కంపెనీల ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డి.గౌరీశ్వరి, కరస్పాండెంట్ నవీన్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. రెండు లక్షలు నుంచి మూడు లక్షలు వరకు ప్యాకేజి ఉంటుందని, ఇంటర్, డిగ్రీ, పీజీలో కెమిస్ట్రీ చదివిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని వారు కోరారు. అభ్యర్థులు ఉదయ 9గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్ని తెలిపారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

తుమికాపల్లి వద్ద ఉన్న వినాయకనగర్‌లో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు సోమవారం 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పెంట కాపాలు మాస్టారు వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల సహకారంతో ఈ సరుకులు అందజేసినట్లు హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పెంట రమేష్, పెంట రవి, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ రవి, రైల్వే విశ్రాంత ఉద్యోగి రమణ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

ప్రజాశక్తి-కొత్తవలస

మానసిక ఒత్తిడికి గురికాకుండా, పౌష్టికాహారం, యోగా, వ్యాయామం, మంచినిద్రతో ఆరోగ్యంగా ఉంటామని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పిహెచ్‌సి సిబ్బంది, గురుకుల విద్యార్థులు వియ్యంపేటలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు-2025.. అనే థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ ఎన్.జగదాంబ, హెచ్‌వి.పద్మావతి, ఫార్మాసిస్ట్ ఆశాజ్యోతి, యుడిసి. సురేష్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, స్టాఫ్ నర్స్ రోజా, దీప, ఎల్.టి.సంతోష్ పాల్గొన్నారు.

కుస్తీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో కొండవెలగాడ జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల పీడీ పతివాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 6 వరకు రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాల బాలికల జూనియర్ కుస్తీ పోటీల్లో 44కిలోల విభాగంలో ఎల్.చైతన్య బంగారుపతకం, 48 కిలోల విభాగంలో ఎం.రణదీప్ రజత పతకం, 67కిలోల విభాగంలో ఎస్.రామాంజనేయులు రజత పతకం సాధించారని తెలిపారు. వీరిని పాఠశాల హెచ్ ఎం.వి.జ్ఞానశంకర్, సిబ్బంది, గ్రామపెద్దలు, యువత అభినందించారు.

నేరాలు ఘోరాలు

సారా తయారీ కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి - కురుపాం

ముందస్తు సమాచారం మేరకు సారా తయారీ కేంద్రాలపై సోమవారం దాడులు నిర్వహించినట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయను మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి గ్రామానికి చెందిన బిడ్డిక గుండు నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనపర్చుకొని తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, సారా తయారీకి అవసరమైన ముడిసరుకులు అందజేస్తున్న అదే గ్రామానికి చెందిన సుబుద్ధి మణికంఠ నుంచి నుండి 15 కేజీల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరుపై కేసు నమోదు చేసే రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

రెండు ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం ఉదయం మండల కేంద్రానికి సమీపంలో గల మూలిగూడా జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు అందించిన సమాచారం మేరకు కురుపాం మండలం జి.సివడ పంచాయతీ అంటిజోల గ్రామం నుంచి ద్విచక్ర వాహనంతో బి.జీవిరావు తన భార్య బి.ప్రియతో కలిసి కురుపాం వస్తుండగా ఎదురుగా జియ్యమ్మవలస మండలం పిటి మండ గ్రామానికి చెందిన అడ్డాకుల చందు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో గుమ్మలక్ష్మీపురం వెళ్తుండగా ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. దీంతో ప్రియ అనే మహిళకు గాయాలు కావడంతో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రస్పత్రికి తరలించారని కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఇళ్లలో నవధాన్యాల సాగు

ప్రజాశక్తి- పాచిపెంట

ప్రతి ఇంట్లో చిరుధాన్యాలు సాగు చేపట్టాలని ఎఒ కె.తిరుపతిరావు అన్నారు. మోసూరు గ్రామంలో ర్యాలీలో పాల్గొన్న అనంతరం రైతులతో మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పంటకు పోషకాలను అందించే నేల అవసరమని పిఎండిఎస్ నవధాన్య సాగు చేపట్టడం ద్వారా పంటకు కావలసిన అన్ని సూక్ష్మ, స్థూల పోషకాలను అందించవచ్చని తెలిపారు. ప్రతి రైతు కనీసం 10 నుండి 20 సెంట్లు మడిలో చిరుధాన్యాల సాగు చేపట్టాలని కోరారు. చిరుధాన్యాలను ప్రధాన పంటగా మాత్రమే కాకుండా అంతర పంటలుగా పత్తి, మొక్కజొన్నలో సాగు చేసుకోవచ్చని, కంచె పంటగా పంట చుట్టూ రెండు వరుసలలో అయినా సరే వేసుకుంటే సరిపోతుందని తెలిపారు. మొక్కజొన్న తర్వాత మొక్కజొన్న సాగు చేపట్టడం ద్వారా భూములు నిర్వీర్యం అవుతాయని వాటిని సారవంతంగా మార్చాలి అంటే పిఎండిఎస్ నవధాన్యం ఒక్కటే ఏకైక మార్గమని తెలిపారు. పిఎండిఎస్ నవధాన్యాల సాగు ద్వారా భూమికి కావలసిన సారం లభించడమే కాకుండా పశువులకు అత్యంత విలువైన పశుగ్రాసం, ఇంటి కోసం ఆకుకూరలు కూడా అందుతాయన్నారు. పాడి పంటలతో పాటుగా మనుషుల ఆరోగ్యం కోసం నవధాన్య సాగును తప్పనిసరిగా రైతులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా రైతులతో నవధాన్య సాగు నేలతల్లి బాగు అనే నినాదాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి తిరుపతినాయుడు గ్రామ వ్యవసాయ సహాయకులు బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: 2025-26 సంవత్సరానికి గాను మండలంలో వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎడిఎ కార్యాలయంలో ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ టిమ్ సభ్యులు మాట్లాడుతూ బహుల విధానాన్ని అమలు చేయాలన్నారు. ముందుగా పార్వతీపురం మండల వ్యవసాయ అధికారి ఎం. అశోక్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యవసాయ, వెలుగు శాఖ మధ్య సమన్వయం పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం అలవాటు చేస్తూ రైతులకు నికర ఆదాయం పెరిగినట్లు చేయాలన్నారు. ఉద్యాన అధికారి ఉద్యాన పంటలు జీడి, మామిడి పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పండించాలని చెప్పారు. అనంతరం ఎపి సిఎన్ఫ్ అధికారులు ఆర్టిఎల్ ప్రకాష్, ఆర్‌టిఒ హేమసుందర్ నవధాన్యాలు పద్ధతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా 30 రకాల విత్తనాలు సుమారు 12 కేజీలు తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలంలో జల్లుకొని 45 రోజుల తర్వాత భూములు దున్నుకోవడం వల్ల భూముల అధిక స్థాయిలో సూక్ష్మజీవులు పెరిగి నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నారుమడికి 25 రోజులు ముందు ఈపిఎండిఎస్ విత్తనాలు వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు సుస్థిర ఆర్థికాభివద్ధి సాధించాలి

గుమ్మలక్ష్మీపురం: జియ్యమ్మవలస మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో సర్పంచ్ రెడ్డి పార్వతి అధ్యక్షతన వ్యవసాయ కార్య చరణ ప్రణాళిక సర్వేపై సోమవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఒ ఝాన్సీ మాట్లాడుతూ రైతులు ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయం చేయడం పెను భారంగా మారుతుంతదన్నారు. ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయ సాగులో పంటలు పండించడం ద్వారా తక్కువ పెట్టుబడితో, తక్కువ విస్తీర్ణంలో, ఎక్కువ దిగుబడులు సాధించడం, మార్కెట్ పరిస్థితిని బట్టి పంటలు పండించడం వల్ల రైతులు ఆర్థిక సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునన్నారు. 2025 వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక సర్వే చేయడానికి వ్యవసాయ అనుసంధాన సంస్థలు అన్ని కలిసి కట్టుగా పని చేయాలన్నారు. రైతు సేవా కేంద్రంలోని పచ్చిరొట్ట ఎరువులు సబ్సిడీపై లభిస్తున్నాయని రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో మహిళలు పాత్ర ఎక్కువగా ఉండడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం గ్రామంలో పెద్దలు, రైతులతో కలిసి ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పి. కుమారి, ఎన్ఎఫ్ఎ అన్నపూర్ణ, విఎఎ ప్రియాంక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లత, జగదీశ్వరి, పార్వతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం: అవగాహన కల్పిస్తున్న కమిటీ సభ్యులు

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీగా ఎన్నుకున్న ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా పనిచేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తెలిపారు. పదో తరగతి మూల్యాంకన పత్రాల స్పాట్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయనకు జిల్లా విద్యాశాఖ అధికారి రమా జ్యోతి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ సాధించి తీరుతామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పాఠశాలల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, దాని కోసం కృషి చేస్తానన్నారు. పార్వతీపురం పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలకు ప్రాతినిధ్యం చేస్తానని తెలిపారు.

సీతానగరం: మండలంలోని మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పరిశీలించారు. అనంతరం ఆయనకు మండలంలో

సీతానగరం: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె

పనిచేస్తున్న ఉపాధ్యాయులు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సెలవు రోజుల్లో స్పాట్‌లో పనిచేసిన రోజులకు కంపెనిన్సంట్ చేయమని ప్రాతినిధ్యం చేస్తానని, పెండింగ్ డిఎలు, సంపాదిత సెలవు నగదు జమ చేయాలని, సర్వీస్ రూల్స్ సాధించి, ఉద్యోగోన్నతులు సాధించి తీసుకొస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ వెంట పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంకపల్లి శివప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశి కుమార్, మరిచర్ల జగదీశ్వర్ రావు, గుల్ల శంకరరావు తదితరులు ఉన్నారు.

నాటు సారాపై విస్తృత దాడులు

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఒడిశాలోని కోరాపుట్ జిల్లా బొత్తడాపల్లి, జయకోటా, రేవటిగూడ, వేపవలస, కుట్రుబంకిడి గ్రామాల్లో జరిపిన మెరుపుదాడిలో భారీగా ఎఫ్ వాష్, నాటు సారా పట్టుబడినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు వెల్లడించారు. నాటు సారా నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నవోదయం 2.0 కింద సోమవారం ఒడిశాలోని పలు గ్రామాల్లో అంతర్రాష్ట్ర దాడి చేసినట్లు చెప్పారు. ఇందుకు ఒడిశా ఎక్సైజ్ శాఖ, పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖలు పూర్తి సహాయ సహకారాలు అందించి ఆపరేషన్‌ను విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్లో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల ప్రొహిబిషన్. ఎక్సైజ్ శాఖలకు

సారాను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

చెందిన 71 మంది సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ. దాడిలో మొత్తం 11,700 లీటర్ల ఎఫ్ వాష్, 60 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఎఫ్ వాష్‌ను ధ్వంసం చేశామన్నారు. ఇటువంటి దాడులను ప్రతి 15 రోజులకొకసారి ప్రణాళికతో అమలు చేస్తామని, నవోదయం 2.0 లక్ష్యాలను సాధించేందుకు దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ దాడికి సహకరించిన ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, ఒడిశా రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో నాటుసారా, దాని తయారీ సంబంధిత సమాచారం ఉంటే, సమీప ఎక్సైజ్ స్టేషన్‌లో గాని లేదా 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు గానీ ఫోన్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నిషిద్ధ నాటు సారా తయారీదారులు, నల్ల బెల్లం సరఫరాదారులపై కూడా దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.జీవన్ కిషోర్ వెల్లడించారు. కార్యక్రమంలో పార్వతీపురం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ కె.సురేష్, ఒడిశా ఎక్సైజ్ శాఖ, పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వయోజన విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి ఒక్క నిరక్షరాశుడు అక్షరాసులుగా మారడానికి వయోజన విద్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని మొండెంఖల్ పంచాయతీ కొత్తూరులో స్వార్డ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వయోజన విద్యా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారు మూల గిరిజన ప్రాంతంలో గల గిరిజన మహిళలు అక్షరాస్యులుగా మారడానికి ఈ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చదువు మహిళలకు ఎంతోగానో ఉపయోగపడుతుందని, కావున ఈకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పలకలు, పుస్తకాలు, బ్లాక్ బోర్డు, లైట్లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం మొండెంఖల్‌లో అనారోగ్యంతో బాధప డుతున్న పురోహితులు బాలుబాబును పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ దయానంద్, టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

విగ్రహం ఏర్పాటు ఆనందదాయకం

గిరిజన ప్రాంతంలో అతిపెద్ద సాయి నాథుని విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందదాయకమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ ధర్మలక్ష్మి పురంలో సాయినాధుని విగ్రహం ప్రతిష్ట కార్యక్రమంలో సోమవారం ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అడ్డాకుల మన్మథ రావు, మండల కన్వీనర్ కొండయ్య, ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, టిడిపి సీనియర్ నాయకులు కోలా రంజిత్ కుమార్, మాజీ జిల్లా కో ఆప్షన్ రంజిత్ కుమార్ నాయకో, సాయి సేవకులు, పాల్గొన్నారు.

కొఠియా గ్రామాల్లో పర్యటిస్తాం

భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్, ఎస్‌పికు లోక్‌సత్తా వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని వివాదాస్పద కొఠియా పరిధిలోని 21 గ్రామాల్లో ఆందోళన చెందుతున్న గిరిజనులకు మద్దతుగా తాము పర్యటించనున్నామని మన్యం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు తమకు భద్రత కల్పించాలని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. సోమవారం ఆయన జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాదవరెడ్డి, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూభాగంలోని కొఠియా పంచాయతీల 21 గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం అక్రమంగా చొరబడి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తూ రోడ్లను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్మించిన అంగన్వాడీ భవనాలను కూల్చివేసిందని చెప్పారు. ఇప్పుడు దిగువ సెంబి వద్ద పవర్ ప్రాజెక్టుని నిర్మిస్తోందని, దీనిని అడ్డుకున్న గిరిజనులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం మౌనంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పరిణామాలపై లోక్‌సత్తాపార్టీ గిరిజనులకు అండగా నిలిచిందని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గోబ్యాక్ ఆంధ్ర పోలీస్ అన్నప్పుడు కూడా లోక్ సత్తాపార్టీ ఆందోళన చేపట్టిందని చెప్పారు.

మన్యం జిల్లా కలెక్టర్, ఎస్‌పి వివాదాస్పద గ్రామాల్లో వెంటనే పర్యటించి గిరిజనులకి భరోసా ఇవ్వాలని భీశెట్టి కోరారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, కార్యదర్శి తుమ్మగంటి రాంమోహన్ రావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, గొర్లె సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, పీజీలో ఉత్తీర్ణత సాధించి, 18 నుండి 35 ఏళ్ల మధ్య వయసు గల ఉనిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 10న కురుపాం జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10 బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత గల అభ్యర్థులను ఎంపిక చేసుకుంటుందన్నారు. జీతం రూ.12వేలు నుంచి రూ.20వేలు, ఇతర అలవెన్సులు కల్పించడం జరుగుతుందన్నారు.

ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటుగా రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, ఒక జత జెరాక్స్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. మరిన్ని వివరాలకు భాను - 6303493720, రాము - 8978878557కు సంప్రదించాలని సూచించారు.

ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి వారి సమస్యలను వినతిపత్రం రూపంలో ఎమ్మెల్యే జగదీశ్వరికి అందించారు. సంబంధిత అధికారులకు సమస్యలు తెలియజేసి, పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని అన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఇటీవల వరుసుగా జరుగుతున్న ఆటో ప్రమాదాలపై డ్రైవర్లకు స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రమాదాలను వివరించారు. ఈ ప్రమాదాల్లో గాయపడ్డ, మరణించిన బాధితుల పరిస్థితులను వివరించారు. అలాగే ఆటో డ్రైవ్ చేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మద్యం సేవించి డ్రైవ్ చేయొద్దని అన్నారు. ముఖ్యంగా సీతంపేటలో ఘాట్ రోడ్డు ఉందని, కొండ నుంచి దిగేటప్పుడు సెల్ఫ్ ఆఫ్ చేసి దిగుతున్నారని, అలా దిగొద్దని అన్నారు. అలా దిగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కావున సెల్ఫ్ ఆపకుండా గేర్‌లో రావాలని వివరించారు. ఎవరైనా పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించుకున్నా, మద్యం సేవించి డ్రైవ్ చేసినా కఠిన శిక్షఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

కుటుంబ సభ్యులకు యువకుడు అప్పగింత

ప్రజాశక్తి - కురుపాం

తప్పిపోయిన బధిర యువకుడ్ని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు తన సిబ్బందితో కలిసి వెతికి పట్టుకొని సోమవారం కుటుంబ సభ్యుల అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని నీలకంఠాపురంలో ఆదివారం రాత్రి జరిగిన యాత్రకు జియ్యమ్మవలసకు చెందిన చిరు వ్యాపారి సంగమేశ్ కుటుంబ సభ్యులతో వచ్చి చిన్న షాప్ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో సంగమేష్ కుమారుడు (21) బధిరుడుడు రాత్రి యాత్రలో తప్పిపోవడంతో తమకు సమాచారం అందజేశారని తెలిపారు. దీంతో తన సిబ్బందితో కలిసి వెతగ్గా సోమవారం మొండెంఖల్‌లో వెతికి పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు. ఈ సందర్భంగా మాటలు రాని కుమారుడిని వెతికి పట్టుకొని అప్పగించడంతో సంగమేస్ కుటుంబ సభ్యులు నీలకంఠాపురం పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.